క్లుప్తంగా

ఉత్తమ అధ్యాపకునికి అభినందనలు


గంగారామ్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సాంఖ్యకశాస్త్ర (స్టాటిస్టిక్స్) అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గంగారామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకునిగా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపల్ నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

ప్రధానమంత్రి జన సురక్షపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: మండలంలోని వాంపల్లిలో ఈరోజు పల్లం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు ప్రధానమంత్రి జన సురక్ష, జీవన జ్యోతి బీమా పథకం, రీ కేవైసీపై అవగాహన కార్యక్రమం జరిగింది. తిరుపతి ప్రాంతీయ అధికారి మాట్లాడుతూ ఖాతాదారులు వారి బ్యాంక్ పాస్‌బుక్ సంబంధించి రీ కేవైసీ బ్యాంకుల్లో తప్పక చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఖాతాదారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం చేసుకోవాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తిరుపతి ప్రాంతీయ అధికారి ప్రకాష్ రత్నబాబు, పల్లం మేనేజర్ శివమానందరెడ్డి, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్లు చిగురుపాటి కిరణ్, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న యమున

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని, బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా జైలు శిక్ష పడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులోభాగంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు.

అవార్డులకు నలుగురు టీచర్లు ఎంపిక

ఏర్పేడు: మండలంలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈఓ ప్రేమలత తెలిపారు. పంగూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి.రామచంద్రయ్య, వడ్డిమిట్ట దళితవాడ పాఠశాల సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు గోపి, ఏర్పేడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆదినారాయణ, చిందేపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గురవారెడ్డి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై, శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలను అందుకోనున్నట్లు ఆమె వెల్లడించారు.

తడి–పొడి చెత్తపై అవగాహన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు గ్రామంలో గురువారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ గురించి వివరించారు. అనంతరం ఆమె గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, గ్రామస్తులకు, పారిశుధ్య కార్మికులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏపీఎం మునెయ్య, ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

చదువులకు చంద్ర గ్రహణం



వరదయ్యపాళెం హైస్కూల్‌లో నిర్మాణ దశలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల భవనం, గోవర్ధనపురం హైస్కూల్‌లో నిర్మాణ దశలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల భవనాలు

- నాబార్డ్ పనులు ఎప్పటికి పూర్తయ్యేనో?
- అర్ధంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం
- చాలీచాలని గదులతో విద్యార్థుల అవస్థలు

వరదయ్యపాళెం: మండలంలోని గోవర్ధనపురం, వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత ప్రభుత్వంలో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో చాలీచాలని తరగతి గదుల్లో పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాబార్డ్ నిధుల ద్వారా వరదయ్యపాళెం హైస్కూల్‌కు రూ.1.20కోట్లు, గోవర్ధనపురం హైస్కూల్‌కు రూ.80లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ ద్వారా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రెండు చోట్ల కూడా భవనాలకు శ్లాబు దశ వరకు పనులు పూర్తయ్యాయి. గదులకు అరుగు, ఇతర చిన్నపాటి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు ఉద్దేశపూర్వకంగా నిధులు మంజూరు చేయకుండా అడ్డంకులు చేస్తుండడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా ఆపివేశాడు. దీంతో 80శాతం పనులు పూర్తయినప్పటికీ సంబంధిత భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఆగిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుంగిన కల్వర్టుకు మరమ్మతులు


కల్వర్టుకు చేసిన మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: సత్యవేడు–చిన్న పాండూరు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలోని కోనాక్షమ్మ ఆలయ సమీపంలో కల్వర్టు కుంగి గుంత ఏర్పడింది. ఈ సమస్య గురించి జులై 7న 'కుంగిన కల్వర్టు' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు కుంగిన కల్వర్టు వద్ద సిమెంటు కాంక్రీటుతో నిర్మాణ పనులు చేసి మరమ్మతులు చేశారు. ఇన్నాళ్లు ఈ గుంత కారణంగా తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- మాయమాటలతో కూటమి జిమ్మిక్కులు
- కూటమి కుయుక్తులకు ప్రజలే బుద్ధి చెబుతారు
- సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్


ఉలవచేనులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మోసం, వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సత్యవేడు మండలం ఉలవచేనులో గురువారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నూకతోటి రాజేష్ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, నేడు ఉన్న పథకాలను ఊడగట్టి మోసపు మాయ మాటలతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని తెలిపారు. నాడు–నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేసి పేద పిల్లల చదువులకు అండగా నిలిస్తే, నేడు ఆగిపోయిన నాడు–నేడు పనులను నిర్లక్ష్యం చేస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అందజేస్తామని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఏడాది పాలన పూర్తయినా ఒక కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి 2029 ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, పళ్లికొండేశ్వరాలయ మాజీ చైర్మన్లు ఏవీఎం బాలాజీ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, నేతలు బెల్లు రమేష్, ఎంపీ రవి, సోమశేఖర్, కుమార్, సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

పరామర్శ

తొట్టంబేడు: మండలంలోని లింగమనాయుడుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొప్పుల చిన్నికృష్ణయ్య సతీమణి కొప్పుల ప్రమీలమ్మ గురువారం మృతిచెందారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో నేతలు ఉన్నం వాసుదేవనాయుడు, కొగిలి సుబ్రహ్మణ్యం, కొప్పుల మురళి, కొప్పుల రత్న, శేఖర్, రమేష్, రాజేంద్ర, రమణయ్య, కోగిలి మనోజ్ ఉన్నారు.

సర్పంచ్‌కు అగౌరవం

- చాంబర్‌లో కుర్చీని తీసేసిన సిబ్బంది
- పదవీ కాలం పూర్తవ్వక ముందే అవమానం
- పంచాయతీ సిబ్బంది అత్యుత్సాహం


విరిగిన కుర్చీని పక్కన పెట్టి ప్లాస్టిక్ కుర్చీ పైన కూర్చొని బాధ్యతలు నిర్వహిస్తున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట: పంచాయతీ నోటిఫికేషన్ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం చూసి పంచాయతీ అధికారులు అత్యుత్సాహంతో పదవీ కాలం పూర్తి కాకముందే సర్పంచ్ కుర్చీని తీసేసిన ఘటన రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో చోటు చేసుకుంది. రేణిగుంట మేజర్ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి వరకు ఉంది. కానీ సోషల్ మీడియాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అంటూ వచ్చిన ప్రచారాన్ని చూసిన పంచాయతీ అధికారులు గురువారం సర్పంచ్ చాంబర్‌లోని కుర్చీని తొలగించారు. ఛాంబర్‌లోకి వెళ్లిన సర్పంచ్ నగేషం తన కుర్చీ స్థానంలో విరిగిన కుర్చీ ఉండడంతో అవాక్కయ్యాడు. సిబ్బందిని అడగగా ఈవో చెప్పడంతో కుర్చీని తీసి వేరొక కుర్చీని వేసినట్లు తెలిపారు.తనకు తెలియకుండా తీసేసి పాత విరిగిపోయిన కుర్చీని వేయడంపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. పాత కుర్చీని పక్కకు జరిపి ప్లాస్టిక్ కుర్చీలో కూర్చొని తన బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న తనను పంచాయతీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే అవమానించారన్నారు. గ్రామ ప్రథమ పౌరుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు విచారించి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ ఈవో మాధవిని వివరణ కోరగా తనకు ఆరోగ్యం సరిలేని కారణంగా కుర్చీని మార్చమని సిబ్బందికి తెలిపానన్నారు. అయితే సర్పంచ్ కుర్చీనీ తీసివేయాలని చెప్పలేదన్నారు. సర్పంచ్‌ను అవమానపరిచే ఉద్దేశం లేదని తెలిపారు.

ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ గ్రామాలకు కేటీ రోడ్డు నుంచి వెళ్లే రోడ్డు దెబ్బతినడానికి కారణమైన రాళ్ల క్వారీ, క్రషర్‌ల యాజమానులకు నోటీసులు నోటీసులు ఇవ్వడంతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయని, క్రషర్లు, క్వారీల నుంచి లారీలలో 50 టన్నులకు పైగా బరువున్న రాళ్ల మెటల్ నింపుకుని తీసుకుపోతుండడంతో రోడ్డు దెబ్బతింది. ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడంతో అధ్వాన్నంగా తయారైందని గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ రోడ్డుపై ఓవర్‌లోడుతో మెటల్ లోడు లారీలు తిప్పకూడదని క్వారీ, క్రషర్ యాజమానులకు నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి పెంచలయ్యను ఆదేశించింది. దీంతో నోటీసులు అందుకున్న క్వారీ, క్రషర్ యాజమానులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆ టీచర్లు అందరికీ ఆదర్శనీయం


టీచర్లను సన్మానిస్తున్న హెచ్‌ఎం

నాగలాపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పి.జ్యోతి (తెలుగు), చక్రపాణి(ఇంగ్లిష్) టీచర్లు తమ పిల్లలైన భీమేష్ (9వ తరగతి), హారిక(2 వ తరగతి)లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ టీచర్లు అందరు ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. సమాజంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న నమ్మకాన్ని పెంపొందించి, ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలను తొలగించాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారని వారు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పూడి కస్తూరయ్య వీరిద్దరిని శాలువ కప్పి సన్మానించారు. ఇదేవిదంగా ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు.

ప్రసూతి హాస్పిటల్లో అన్నమాచార్య సంకీర్తనలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ప్రజల్లోనే కాకుండా స్థానిక ప్రభుత్వ మెటర్నటీ హాస్పిటల్లో రోగులు, వారి సహాయకుల్లోనూ ఆధ్యాత్మికత, భక్తి భావాలను పెంపొందించేందుకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఉపక్రమించింది. ప్రతి శుక్ర, శని, ఆది వారాల్లో అన్నమాచార్య సంకీర్తనలు, హరికథ గానం ఇత్యాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోంది. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రాజెక్టు గాత్ర కళాకారుడు సుబ్రహ్మణ్యం బృందం అన్నమాచార్య సంకీర్తనలను కార్యక్రమం నిర్వహించనుంది. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల, సీఎంఓ డాక్టర్ ఆర్ఆర్.రెడ్డి విజ్ఞప్తి మేరకు దీనికి పూనుకున్నట్టు అన్నమాచార్య ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కోలాహలం.. గణనాథుని నిమజ్జనం



సీతారాంపేటలో గణనాథుని ఊరేగింపు ఉత్సవం, లడ్డూను దక్కించుకున్న సర్పంచ్ నిర్మల

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేటలో గురువారం రాత్రి గణనాథుని ఊరేగింపు, నిమజ్జనోత్సవం కోలాహలంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, యువత కేరింతల నృత్యాల మధ్య స్వామివారిని గ్రామవీధుల్లో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందు స్వామివారి లడ్డూ వేలంపాట నిర్వహించగా, స్వామివారి లడ్డూను గ్రామ సర్పంచ్ చేమూరు నిర్మల రూ.56వేలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ పెద్దలు ఆమెకు లడ్డును అందించి సత్కరించారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు


బుచ్చినాయుడుకండ్రిగలో ఉత్తమ ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బుద్ధులను నేర్పే జాతి నిర్మాతలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పంజాలి ఘటించారు. అనంతరం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ సత్కారం పొందిన 14 మంది ఉపాధ్యాయులను అధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి జగన్నాథం, నేతలు ఘనంగా సన్మానించారు.

కల్యాణ వెంకన్నకు పవిత్రాల సమర్పణ


పట్టు వస్త్రాలను ఊరేగిస్తున్న వేదపండితులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా గురువారం మూలవర్లకు, పరివార దేవతలకు, ఉత్సవమూర్తులకు పట్టు పవిత్రాలను సమర్పించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. నిర్మిత హోమశాలలో వాస్తు, గ్రహ శాంతి హోమాలను నిర్వహించారు. సాయంత్రం పట్టు పవిత్రాలను ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించి, యాగశాలలో ప్రత్యేక పూజలను, పూర్ణాహుతి నిర్వహించిన రిత్వికులు పవిత్రాలను ఆలయంలోని మూల, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు పట్టు పవిత్రాలను సమర్పించారు. వార, పక్ష, వార్షిక ఉత్సవాలలో జరిగిన పొరపాట్లు, ఊరేగింపులో ఉత్సవమూర్తుల అపవిత్ర దోష నివారణార్థం పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టార్యులు తెలిపారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనం పై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు పర్యవేక్షించారు.

పుష్పపల్లకీలో విహరించిన అవనాక్షమ్మ



నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు సుందరంగా అలంకరించిన పుష్పపల్లకీని అధిరోహించి మహిసాసురమర్దినిగా సముదాయం, శెంగుందర్ వీధుల్లో విహరించారు. జాతరలో భాగంగా గురువారం ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు శుద్ధి, తోమాల అనంతరం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. రాత్రి సర్వాంగసుందరంగా వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకీని అధిరోహించారు. సముదాయం, నారాయణవనంలోని శెంగుందర్ వీధుల్లో విహరించిన అమ్మవారికి మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజైన శుక్రవారం రాత్రి సముదాయం, కీళగరం, నారాయణవనంలలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.